# ఎన్నికలకు బీఆర్ఎస్ సన్నద్ధం

- వందమంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జి నియామకం
- పోలింగ్ కేంద్రాలకు ఒక కన్వీనర్
- ప్రతి పది గ్రామాలకు పార్టీ సమన్వయ కర్త
- నియోజకవర్గాల వారీగా క్యాంపెయిన్ ఇన్‌చార్జిల నియామకం




సంగారెడ్డి అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ కదులుతున్నది. అసెంబ్లీ ఎన్నికల రేసులో మిగితా పార్టీ కంటే బీఆర్ఎస్ ముందంజలో ఉన్నది. ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇదివరకే ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించారు. సంగారెడ్డి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను సీఎం కేసీఆర్ ప్రకటించారు. అందోలు, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్ నుంచి ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యేలు మరోమారు పోటీ చేయనున్నారు. సంగారెడ్డి నుంచి మాజీఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బరిలో ఉంటారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సూచన మేరకు పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు మహిపాల్‌రెడ్డి(పటాన్ చెరు) చింతా ప్రభాకర్(సంగారెడ్డి), చంటి క్రాంతికిరణ్(అందోలు),మాణిక్‌రావు(జహీరాబాద్), భూ పాల్‌రెడ్డి(పటాన్ చెరు) ఎన్నికల కసరత్తు మొదలుపెట్టారు.

**ప్రతి వందమంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జి**

బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నది. సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భారీ మెజార్టీతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపొందేలా గ్రామస్థాయి నుంచి మొదలుకుని నియోజకవర్గ స్థాయి వరకు ప్రత్యేకంగా ఇన్‌చార్జిలను నియమిస్తున్నది. సంగారెడ్డి, పటాన్‌చెరు, నారాయణఖేడ్, అందోలు, జహీరాబాద్ నియోజకవర్గాల్లో ఎన్నికల బాధ్యతలు పర్యవేక్షించేందుకు పార్టీ తరపున నియోజకవర్గ ఎన్నికల పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో ఈ కమిటీలను వేశారు. అలాగే మండలస్థాయిలో కూడా కమిటీలను వేశారు. ఇక గ్రామస్థాయిలో ప్రతి వందమంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జిలను పార్టీ తరపున నియమించారు. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో పదిమంది క్రియాశీలక కార్యకర్తలకు ఎన్నికల బాధ్యతలను అప్పగించారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రానికి పార్టీ తరపున ఒక కన్వీనర్‌ను నియమించారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 281 మంది, అందోలులో 313, పటాన్‌చెరులో 391, నారాయణఖేడ్‌లో 296, జహీరాబాద్‌లో 313మంది పోలింగ్ బూత్ లెవల్ కన్వీనర్‌లను నియమించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్ బూత్‌లెవల్ కన్వీనర్లతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ వచ్చేవారం నుంచి బూత్‌లెవల్ కన్వీనర్ ఇతర ఇన్‌చార్జిలతో సమావేశం కానున్నారు. పటాన్‌చెరు, నారాయణఖేడ్, జహీరాబాద్ ఎమ్మెల్యేలు పార్టీ బూత్ లెవల్ కన్వీనర్లతో సమావేశాలు నిర్వహించనున్నారు.

**క్యాంపెయిన్ ఇన్‌చార్జిల నియామకం**

సంగారెడ్డి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల కోసం బీఆర్ఎస్ పార్టీ క్యాంపెయిన్ ఇన్‌చార్జిలను నియమించింది. అందోలు నియోజకవర్గ క్యాంపెయిన్ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, జహీరాబాద్ క్యాంపెయిన్ ఇన్‌చార్జిగా మాజీ బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, సంగారెడ్డి అసెంబ్లీ క్యాంపెయిన్ ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, టీఎస్ఎంఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌లను నియమించింది. పటాన్‌చెరు, నారాయణఖేడ్ క్యాంపెయిన్ ఇన్‌చార్జిలను త్వరలోనే నియమించనున్నారు. క్యాంపెయిన్ ఇన్‌చార్జిలు నియోజకవర్గాలో ఎన్నికల ప్రచార నిర్వహణతోపాటు కార్యకర్తల పనితీరుపై పర్యవేక్షించనున్నారు.



అక్కన్నపేట: వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ, పోలీస్ సిబ్బంది

## అక్కన్నపేట చెక్ పోస్ట్ వద్ద నగదు పట్టివేత

అక్కన్నపేట, అక్టోబర్ 13: ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో అక్కన్నపేట మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం వాహనతనిఖీల్లో భాగంగా రూ.1.30 లక్షలు పట్టుకున్నట్లు అక్కన్నపేట ఎస్ఐ వివేక్ తెలిపారు. విధి నిర్వహణలో ఉదయం వాహనాల తనిఖీ చేస్తుండగా తరిగొప్పుల నుంచి వస్తున్న టాటా ఏసీ వాహనంలో రూ.1.30లక్షల నగదు దొరికిందన్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి, నగదును సీజ్ చేశామన్నారు. అనంతరం హుస్నాబాద్ డివిజన్ రిటర్నింగ్ అధికారితోపాటు ఫ్లయింగ్‌స్క్వాడ్‌కు అప్పగించామన్నారు. ఈ తనిఖీలో కానిస్టేబుళ్లు కనకయ్య, రామస్వామి, యాదగిరి తదితరులు ఉన్నారు.

## విస్తృతంగా వాహన తనిఖీలు



చాడ వెంకటరెడ్డి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

హుస్నాబాద్‌రూరల్, అక్టోబర్ 13: మండలంలోని జిల్లెలగడ్డ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా శుక్రవారం సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు, మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి వాహనాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా డబ్బులు, మద్యం తరలిస్తే చర్యలు తప్పవని, నగదు ఉంటే ఆధారాలు చూపాలని పోలీసులు సూచించారు.

## ఖేడ్‌లో రూ.7.51లక్షలు సీజ్

నారాయణఖేడ్, అక్టోబర్ 13: ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో శుక్రవారం రూ.7.51 లక్షలు సీజ్ చేసినట్లు నారాయణఖేడ్ ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో వాహన తనిఖీలు చేస్తుండగా రూ.7.51 లక్షలు పట్టుబడినట్లు తెలిపారు. డబ్బుకు సంబంధించి సరైన ఆధారాలు చూపని కారణంగా ఆ మొత్తాన్ని సీజ్ చేసి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డికి అప్పగించామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా నగదు తరలించే వారు ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి తరలించవద్దని సూచించారు.

## ఎన్నికల గ్రీవెన్స్‌సెల్ విభాగం ఏర్పాటు

**మెదక్ ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా**

మెదక్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): తెలంగాణ శాసనసభ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ సెల్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ఎన్నికల గ్రీవెన్స్‌సెల్ విభాగంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, ఆడిట్ అధికారి రాకేశ్, ట్రెజరీ అధికారి చిన్న సాయిలు, గ్రీవెన్స్‌టీం సభ్యులుగా ఉన్నారని తెలిపారు. సభ్యులు, బ్యాంకు అధికారులతో శుక్రవారం తన చాంబర్‌లో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియలో ఎన్నికల కోసం నియమించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ) నిర్దేశకంగా, స్టాటస్టిక్ సర్వేలెన్సు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, వీడియో సర్వైలెన్స్ బృందాలు, వీడియోవీవింగ్ బృందాలు, ఎంసీసీ బృందాల సర్వేలెన్సు బృందాలతో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములు పనిచేస్తున్నాయని తెలిపారు. పోలీసులు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీంలు చేసిన తనిఖీల్లో ఎక్కడైనా రూ.50వేలకన్న అధికంగా రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే ఎలాంటి ఆధారాలు లేకుం, సందేహాస్పదంగా ఉంటే వాటిని సీజ్ చేయాలని తెలిపారు. రూ.లక్ష నుంచి రూ.పది లక్షల వరకు ఉన్నచో ఆ సమాచారాన్ని ఇన్‌కం టాక్స్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో పట్టుబడిన నగదుకు సరైన పత్రాలను, ఎన్నికల గ్రీవెన్స్ విభాగంలో సమర్పించి నగదును పొందవచ్చని తెలిపారు. పౌరులు ఎవరైనా ఎన్నికలపై సందేహాలను నివృత్తి చేసుకోవడానికి 1950 హెల్ప్‌లైన్ 24/7 అందుబాటులో ఉంటుందన్నారు. ఎన్నికల గ్రీవెన్స్ టీం డీఆర్‌డీవో శ్రీనివాస్ 9281484100, జిల్లా ఆడిట్ అధికారి, రాకేశ్ 9948213828, జిల్లా ట్రెజరీ అధికారి చిన్నసాయిలు 7799934150 నంబర్లను అందజేశారు.

## రామాయంపేటలో రూ.90వేలు సీజ్



అక్కన్నపేట శివారులో
ఓ మహిళ వద్ద ఉన్న రూ.90వేలను సీజ్‌చేస్తున్న పోలీసులు

రామాయంపేట, అక్టోబర్ 13: ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రజల వద్ద రూ.50వేలపైగా డబ్బులు ఉంటే వాటికి సరిపడా పత్రాలు ఉండాలని లేకుంటే సీజ్ చేస్తామని రామాయంపేట ఎస్సై రంజిత్ పేర్కొన్నారు. శుక్రవారం వాహన తనిఖీల్లో భాగంగా రామాయంపేట పట్టణ శివారులోని అక్కన్నపేట వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఝాన్సీలింగాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి సౌందర్య వద్ద రూ.90వేల నగదు లభించినట్లు తెలిపారు. ఆ నగదుకు సంబంధించిన పత్రాలు లేనందున సీజ్‌చేసి జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారికి పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

## పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోటీలు

**మెదక్ ఎస్పీ రోహిణిప్రియదర్శిని**

మెదక్ అర్బన్, అక్టోబర్13: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పరిధిలోని విద్యార్థిని, విద్యార్థులకు, యువతకు, ఔత్సహిక ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్‌కు సంబంధించి రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని ఎస్పీ రోహిణిప్రియదర్శిని శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ అక్టోబర్ 31 వరకు నిర్వహిస్తున్న పలు కార్యక్రమాల్లో భాగంగా పోలీస్ త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఈ మధ్యకాలంలో తీసిన తక్కువ నిడివి (మూడునిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్, ఫొటోలను రాష్ట్ర స్థాయి పోటీల కోసం ఈనెల 22వ తేదీలోగా మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో షార్ట్‌ఫిల్మ్ పెన్‌డ్రైవ్‌ను 10x8 సైజ్ ఫొటోలను పోలీసు పీఆర్‌వోకు అందజేయాలని సూచించారు.


**ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు సంబంధించి..**

రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తిప్రతిష్టలను పెంపొందించే అంశాలకు సంబంధి గతేడాది 2022 అక్టోబర్ నుంచి ఇప్పటివరకు తీసిన మూడు ఫొటోలను పూర్తి వివరాలతో పెన్‌డ్రైవ్‌లోకానీ సీడీలో కానీ ఈనెల 22వ తేదీలోగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 9640474336 సంప్రదించాలని తెలిపారు.

## మత్తు పదార్థాలకు పిల్లలను దూరంగా ఉంచాలి

**సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 13: పిల్లలను మత్తు మందులు, మత్తు పానీయాలకు దూరంగా ఉంచాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సూచించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు డ్రగ్, ఇతర మత్తు పదార్థాల వైపు వెళ్లకుండా చూడటం కోసం ఆయా శాఖలు చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. నేషనల్ కమిషన్ ఆఫ్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్‌రైట్స్ మార్గదర్శకాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించనున్నట్టు స్పష్టం చేశారు. వచ్చే 3 నెలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల సంయుక్త కార్యాచరణ ప్రణాళికను తయారు చేశామన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసి మత్తు పదార్థాల ద్వారా కలిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణి, వివిధ శాఖ ల అధికారులు మాణెమ్మ, వెంకటేశ్వర్లు, డాక్టర్ గాయత్రీదేవి, రాజారెడ్డి, రమేశ్, రవికిరణ్, మాధవి, గోవింద్‌రామ్, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న
సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

## 16 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 13: సంగారెడ్డి జిల్లాలో 2022-23 సంవత్సరానికి ఓపెన్ స్కూల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ కోర్సుల అభ్యాసకులకు సప్లిమెంటరీ థియరీ పరీక్షలు ఈనెల 16 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్టు డీఈవో వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షలు ఉంటాయన్నారు. సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్‌సీ, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 1062 మంది అభ్యాసకులు పరీక్ష రాయనున్నారని, అందులో 402 మంది ఎస్ఎస్‌సీ, 660 మంది ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా ఓపెన్ స్కూల్ పరీక్షల కమిటీ పని చేస్తుందన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అభ్యాసకులు పరీక్షాకేంద్రానికి గంట ముందస్తుగా చేరుకోవాలని సూచించారు. సమాచారం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 08455-276434, 8008403635 నెంబర్లలో సంప్రదించాలన్నారు.